సాక్షి చిత్తూరు

ఆదివారం । 5 । మార్చి । 2023



చిత్తూరు బులియన్

బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.53,000
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.4,700

వెండి:

హోల్‌సేల్ ధర (కిలో)	రూ.65,000
రిటైల్ వెండి గ్రాము	రూ.67.00

	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	35	17
తిరుపతి	36	19
తిరుమల	31	14
గూడూరు	35	20
నగరి	36	18



జిల్లాలో విస్తృత తనిఖీలు

తిరుపతి అలిపిరి : ఎర్రచందనం అక్రమ రవాణాపై విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నట్టు జిల్లా అటవీశాఖ అధికారి సతీష్‌రెడ్డి శనివారం తెలిపారు.

న్యూస్‌రీల్

ప్రభాత ప్రణామం!



సోమల: మండలంలో గార్గేయ నదీ తీరంలో నూతనంగా ప్రతిష్ఠించిన గౌరీదేవి సమేత గార్గేయ లింగేశ్వరస్వామికి శనివారం ఉదయం సూర్యుడు ప్రణమిల్లాడు. శివలింగంపై సోకిన కిరణాలను వీక్షించిన భక్తులు పులకించారు. ఈ సందర్భంగా స్వామివారికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఓట్ల లెక్కింపుపై శిక్షణ



కౌంటింగ్ పర్సనల్స్‌కు అవగాహన కల్పిస్తున్న జేసీ వెంకటేశ్వర్

సాక్షి, చిత్తూరు : ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియపై కౌంటింగ్ పర్సనల్స్‌కు శనివారం జెడ్పీ సమావేశ మందిరంలో ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించారు. జేసీ వెంకటేశ్వర్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం నియమావళిని క్షుణ్ణంగా చదివి నిష్పక్షపాతంగా కౌంటింగ్ చేపట్టాలని ఆదేశించారు. ఈ నెల 10వ తేదీన మరో పర్యాయం ఆర్‌వీఎస్ కాలేజీలో శిక్షణ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. డీఆర్‌ఓ రాజశేఖర్ మాట్లాడుతూ కౌంటింగ్ విధులు నిర్వహించనున్న సిబ్బంది తప్పనిసరిగా మాన్యువల్‌పై అవగాహన పెంపొందించుకోవలని సూచించారు. విశ్రాంత జేసీ చంద్రమౌళి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌తో పర్సనల్స్‌కు నిబంధనలను వివరించారు. కార్యక్రమంలో తిరుపతి డీఆర్‌ఓ శ్రీనివాసరావు, జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి, ఆర్‌డీఓలు రేణుక, సుజన, శివయ్య, మురళి, చంద్రముని రాణార్, రామారావు, కిరణ్‌కుమార్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కోదండరామిరెడ్డి పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు చట్టాలపై అవగాహన



మాట్లాడుతున్న న్యాయమూర్తి కరుణకుమార్

చిత్తూరు రూరల్ : సీడీపీఓ కార్యాలయంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు చట్టాలపై శనివారం అవగాహన కల్పించారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఐ.కరుణకుమార్ మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. భావిభారత పౌరులను తీర్చిదిద్దడంలో అంగన్‌వాడీల పాత్ర మహత్తరమైందన్నారు. సీడీపీఓ శ్యామ్ సుగుణకుమారి, నోడల్ ఆఫీసర్ నిర్మలదేవి, వన్‌స్టాప్ సెంటర్ సుజాత, సిబ్బంది శివ, మురళి, రాజేశ్వరి, పుష్పవతి, వసంత కుమారి, అనురాధ పాల్గొన్నారు.

'స్పందన'పై అలసత్వం వహిస్తే చర్యలు



సిబ్బందికి సూచనలిస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

వి.కోట: ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా చేపట్టిన స్పందన కార్యక్రమంలో వచ్చిన వినతులపై అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు హెచ్చరించారు. శనివారం మండలంలోని బీసీపల్లె, ముదరందొడ్డి, చింతమాకులపల్లె, బైరుపల్లె, ఎస్.బండపల్లె గ్రామ సచివాలయాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామాల్లో తాగునీటి సరఫరా, డ్రైనేజీ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని స్పష్టం చేశారు.



• సుమం.. సమ్మోహనం

సుగంధ సుమాల అలంకరణలో కాణిపాకం వరసిద్ధుని ఆలయం కనులపండువగా దర్శనమిస్తోంది. విద్యుద్దీపాల వెలుగుల్లో విరాజిల్లుతోంది. లక్ష్మోదక లక్ష్మీగణపతి హవనము పూజలను పురస్కరించుకుని గణనాథుని సన్నిధి దేదీప్యంగా కాంతులీనుతోంది. విశేష పుష్పమాలల నడుమ శోభాయమానంగా అలరారుతోంది. మూషికవాహనుని వైభవాన్ని వీక్షించి భక్తకోటి పరవశిస్తోంది.

- కాణిపాకం (యాదమరి)

చిన్నాన్న ఎక్కడ చినబాబూ..?

- ప్రజాస్పందన లేకే లోకేష్ విమర్శలు
- అసత్య ఆరోపణలు చేస్తే ప్రజలే బుద్ధి చెబుతారు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి

పుంగనూరు : నారా లోకేష్‌కు దమ్ముంటే తన చిన్నాన్న రామ్మూర్తినాయుడు ఎక్కడ ఉన్నాడో తెలియజేయాలని, రహస్యంగా ఎందుకు దాచారో వెల్లడించాలని తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి ప్రశ్నించారు. శనివారం పుంగనూరులో ఆయన విలేకర్లతో మాట్లాడారు. కుప్పం అభివృద్ధి పేరుతో చంద్రబాబు రూ.వేల కోట్లు ఆర్జించిన విషయం లోకేష్‌కు కూడా తెలుసన్నారు. యువగళం పాదయాత్రకు జనం రాకపోవడంతో కర్ణాటక నుంచి పెయిడ్ ఆర్టిస్టులను పిలిపించుకున్నారని ఎద్దేవా చేశారు. టీడీపీ ప్రభుత్వంలో పుంగనూరు అభివృద్ధికి రూ.100 కోట్లు మంజూరు చేశామని లోకేష్ చెప్పడంపై మండిపడ్డారు. పెద్దిరెడ్డిపై కక్షతో పుంగనూరు నియోజకవర్గాన్నే పట్టించుకోలేదని ఆరోపించారు. కుప్పం నుంచి తిరుపతి వెళుతూ మార్గం మధ్యలో అక్కడక్కడా శిలాఫలకాలు మాత్రం వేశారని విమర్శించారు. చంద్రబాబు హయాంలో కమీషన్ ఏజెంట్లు, బ్రోకర్లు రాజ్యమేలారని, ఇజ్రాయెల్ ప్రాజెక్టు పేరుతో రూ.వందల కోట్లు స్వాహా చేశారని స్పష్టం చేశారు. ఆస్పత్రులు, కళాశాలలను బంధువులకు కేటాయించి పేదలను దోచుకున్నారని వెల్లడించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ప్రతిపక్షనేత నియోజకవర్గమైనా కుప్పంలో భారీగా అభివృద్ధి పనులు చేపట్టినట్లు వివరించారు. నీతి నిజాయితీతో పెద్దిరెడ్డి కుటుంబం ప్రజలకు సేవలందిస్తోందని తెలిపారు. అభివృద్ధిలో పుంగనూరు నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిద్దిన ఘనత మంత్రి పెద్దిరెడ్డికే దక్కుతుందన్నారు. పల్లెబాట పేరుతో మారుమూల గ్రామాలను సైతం సందర్శించి, ఆయా ప్రాంతాల్లోని సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించారని వెల్లడించారు. కష్టం అంటూ ఎవరు వచ్చినా ఆదరించి, అండగా నిలిచే మహోన్నత వ్యక్తిత్వం మంత్రి పెద్దిరెడ్డి సొంతమని కొనియాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో పార్టీలకు అతీతంగా పేదలందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని తెలిపారు. ఇవన్నీ తెలుసుకోకుండా లోకేష్ అనవసరంగా, అసత్య ఆరోపణలు చేస్తే రాబోయే ఎన్నికల్లో ప్రజలే తగిన గుణపాఠం నేర్పుతారని హెచ్చరించారు.

ఆటల్లో ఆణిముత్యాలు

జిల్లాలో మారుమూల ప్రాంతమైన కుప్పం మండలంలోని విద్యార్థులు క్రీడల్లో సత్తా చాటుతున్నారు. ప్రభుత్వ ప్రోత్సాహాన్ని అందిపుచ్చుకుని ఉత్తమ ప్రతిభ కనబరుస్తున్నారు. ఉపాధ్యాయుల పర్యవేక్షణలో చదువుతోపాటు ఆటల్లోనూ రాణిస్తున్నారు. జాతీయ, రాష్ట్రస్థాయి పోటీల్లో పతకాలు సాధిస్తున్నారు. మరింత సహకారం అందిస్తే అంతర్జాతీయస్థాయిలోనూ అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకుంటామని ధీమా వ్యక్తం చేస్తున్నారు.



పాఠశాల ఆవరణలో విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న పీడీ లోకనాథం (ఫైల్)

- క్రీడల్లో రాణిస్తున్న చందం హైస్కూల్ విద్యార్థులు
- జాతీయ, రాష్ట్రస్థాయి పోటీలకు ప్రాతినిధ్యం
- పిల్లల ప్రతిభకు మెరుగులు దిద్దుతున్న ఉపాధ్యాయులు



జాతీయ, రాష్ట్రస్థాయిలో రాణించిన విద్యార్థులతో ఉపాధ్యాయులు (ఫైల్)

కుప్పం రూరల్ : కుప్పం మండలంలోని చందం ఉన్నత పాఠశాలలో మొత్తం 337 మంది విద్యార్థులు ఉన్నారు. అందులో దాదాపు 100 మంది వివిధ క్రీడల్లో ప్రతిభను కనబరుస్తున్నారు. ఇప్పటికే జాతీయస్థాయిలో ఇద్దరు, రాష్ట్రస్థాయి పాఠశాల క్రీడల్లో 9మంది విద్యార్థులు పాల్గొని సత్తా చాటారు.

క్రీడలంటే అమితాసక్తి

చందం పాఠశాల విద్యార్థులకు క్రీడలంటే ప్రత్యేక ఆసక్తి. ముఖ్యంగా కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బాస్కెట్‌బాల్, బేస్‌బాల్, నెట్‌బాల్, త్రోబాల్, యోగాల్లో విశేషంగా రాణిస్తున్నారు. ఉదయం పాఠశాల ప్రారంభానికి ముందు 8 నుంచి 9 గంటల వరకు, సాయంత్రం పనివేళలు పూర్తి కాగానే 4 నుంచి 5 గంటల వరకు విద్యార్థులు క్రీడల్లో కఠోర సాధన చేస్తున్నారు. అలాగే సెలవులు, ఖాళీ సమయాల్లో బాల్, బ్యాట్లు, వాలీబాల్ వంటి క్రీడా సామగ్రి పట్టుకుని పాఠశాల మైదానంలో ప్రాక్టీస్ చేస్తుంటారు.

జాతీయ స్థాయిలో ప్రతిభ

పదోతరగతి విద్యార్థులు దివాకర్, అనిల్‌కుమార్ జనవరిలో ఒడిశా రాష్ట్రం కటక్‌లో జరిగిన జాతీయ స్థాయి పాఠశాల క్రీడల్లో ప్రతిభ కనబరిచారు. దివాకర్ టెన్నిస్ వాల్‌బాల్‌లో విజేతగా నిలవగా, అనిల్ వాలీబాల్ విభాగంలో రాణించాడు. అలాగే కర్నూల్‌లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో 10వ తరగతి విద్యార్థులు తోషన్‌రాజ్ షూటింగ్‌లో, మణికంత, చరణ్‌తేజ్ టెన్నిస్ వాలీబాల్‌లో, దర్శిని డిస్క్‌త్రో, ఝాన్సీరాణి యోగాలో, 9వ తరగతి విద్యార్థులు పూజా నెట్‌బాల్‌లో, సుష్మా , ఉషారాణి బేస్‌బాల్ పోటీల్లో సత్తా చాటి బహుమతులు సాధించారు.

పకడ్బందీ శిక్షణ

విద్యార్థులు క్రీడల్లో రాణించడం వెనుక పాఠశాల పీడీ లోకనాథం కృషిని చెప్పుకోవాల్సిందే. క్రీడా కోటాలో ఉద్యోగం పొందిన ఆయన ఎప్పటికప్పుడు తగు సలహాలు అందిస్తూ విద్యార్థులను ప్రోత్సహిస్తున్నారు. పిల్లల ప్రతిభకు మెరుగులు దిద్దుతూ పకడ్బందీగా శిక్షణ ఇస్తున్నారు. సెలవుల్లో సైతం పిల్లలను గ్రౌండ్‌కు పిలిచి సాధన చేయిస్తుంటారు. క్రీడా దుస్తులు, సామగ్రి సొంత ఖర్చులతో కొనిచ్చి సహకరిస్తున్నారు. ప్రధానోపాధ్యాయుడు మోహన్‌సింగ్ తన వంతుగా విద్యార్థులకు చక్కటి వసతులు కల్పించేందుకు చర్యలు చేపడుతున్నారు.

ప్రభుత్వం ప్రోత్సాహం

ముఖ్యమంత్రి వై ఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యారంగంలో ప్రవేశపెట్టిన విప్లవాత్మకమైన మార్పులతో విద్యార్థులు చదువుతోపాటు క్రీడలపై సైతం ఆసక్తి పెంచుకుంటున్నారని ఉపాధ్యాయులు వెల్లడిస్తున్నారు. పిల్లలకు మంచి పౌష్టికాహారం అందిస్తుండడంతో క్రీడల్లో పాల్గొనే శారీరక దృఢత్వం వస్తోందన్నారు. అలాగే క్రీడా పరికరాలను కూడా సకాలంలో సమకూరుస్తుండడంతో మంచి ఫలితాలు వస్తున్నాయని వివరిస్తున్నారు. అందుకే గతంలో ఎన్నడూ లేని విధంగా చందం పాఠశాల నుంచి మొత్తం 11 మంది విద్యార్థులు జాతీయ, రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్నారని తెలియజేశారు. ఈ క్రమంలోనే అడవిబూదుగూరు, ఎస్.కొత్తపల్లె, గరిగచీనేపల్లె పాఠశాలల విద్యార్థులు సైతం రాష్ట్రస్థాయి పాఠశాల క్రీడల్లో పాల్గొనడం విశేషం.

ఒలింపిక్స్‌లో ఆడాలని ఉంది



మాది ఎస్.కొత్తపల్లె. తల్లిదండ్రులు సురేష్ బాబు, పార్వతి కూలి పనులు చేసుకుంటూ నన్ను చదివిస్తున్నారు. నాకు టెన్నిస్ వాలీబాల్ అంటే చాలా ఇష్టం. ఒడిశాలో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో విజేతగా నిలిచా. ఎప్పటికైనా దేశం తరపున ఒలింపిక్స్‌లో ఆడాలని ఉంది. తగిన ప్రోత్సాహం అందిస్తే అనుకున్న లక్ష్యాన్ని చేరుకుంటా.

– దివాకర్, విద్యార్థి

వెంటనే గ్రహిస్తున్నారు



మా పాఠశాల విద్యార్థులు ఏ విషయమైనా వెంటనే గ్రహిస్తున్నారు. చాలా చురుగ్గా ఉంటారు. అందుకే చదువుతో పాటు క్రీడల్లోను రాణిస్తున్నారు. పిల్లలకు టెన్నిస్ వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, యోగా, షూటింగ్ బాల్, వాలీబాల్, నెట్‌బాల్, ఫుట్‌బాల్, త్రోబాల్, బేస్‌బాల్‌లో శిక్షణ ఇస్తున్నాం. ఇతర పాఠశాలల పీడీల సహాయ సహకారాలు తీసుకుంటున్నాం. విద్యార్థులు, ఉపాధ్యాయులు పూర్తిగా సహకరిస్తున్నారు.

– లోకనాథం, ఫిజికల్ డైరెక్టర్, చందం హైస్కూల్

గర్వంగా ఉంది



మా పాఠశాల విద్యార్థులు జాతీయస్థాయిలో రాణిస్తున్నారంటే గర్వంగా ఉంది. ఇప్పటికే 11 మంది విద్యార్థులు జాతీయ , రాష్ట్రస్థాయిలో సత్తా చాటారు. విద్యార్థులు పతకాలు తెచ్చినప్పుడు మా సొంత పిల్లలు సాధించినట్లే ఉంటుంది. మరింత మందిని జాతీయస్థాయి పోటీలకు పంపాలన్నదే లక్ష్యం. విద్యార్థులకు తల్లిదండ్రుల ప్రోత్సాహం కూడా గొప్పగా ఉంది.

– మోహన్‌సింగ్, ప్రధానోపాధ్యాయుడు, చందం హైస్కూల్

పెద్దల పోరుకు కౌంట్‌డౌన్

- పోలింగ్.. కౌంటింగ్‌కు శరవేగంగా ఏర్పాట్లు
- క్షేత్రస్థాయిలో రిటర్నింగ్ అధికారి పర్యవేక్షణ



ఏర్పాట్లు పరిశీలిస్తున్న రిటర్నింగ్ అధికారి హరినారాయణన్, ఎస్పీ రిశాంత్‌రెడ్డి, జేసీ వెంకటేశ్వర్

చిత్తూరు కలెక్టరేట్ : ఉమ్మడి ప్రకాశం–నెల్లూరు–చిత్తూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు కౌంట్‌డౌన్ మొదలైంది. 13న పోలింగ్, 16వ తేదీన కౌంటింగ్ జరగనున్న నేపథ్యంలో జిల్లా యంత్రాంగం శరవేగంగా ఏర్పాట్లుచేస్తోంది. ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు చర్యలు చేపడుతోంది. రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ హరినారాయణన్, జేసీ వెంకటేశ్వర్ క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

పక్కాగా మౌలిక వసతులు

ఓటర్లు సజావుగా ఓటు హక్కు వినియోగించుకునేందుకు అధికారులు సర్వం సిద్ధం చేస్తున్నారు. పోలింగ్ కేంద్రాల్లో పక్కాగా మౌలిక వసతులు కల్పిస్తున్నారు. నిష్పక్షపాతంగా ఎన్నికల ప్రక్రియ పూర్తి చేసేందుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపడుతున్నారు. ఈ నెల 13 వ తేదీ ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ నిర్వహించనున్నారు.

ఓటర్లు ఇలా....

పట్టభద్రులు 3,81,181 మంది, టీచర్లు 27,694 మంది తమ ఓటు హక్కును ఈ ఎన్నికల్లో వినియోగించుకోనున్నారు. వారందరికీ ఈ నెల 7వ తేదీ లోపు ఓటరు స్లిప్పులను పంపిణీ చేసేలా అధికారులు చర్యలు చేపట్టారు. పట్టభద్రుల ఎన్నికలకు 453 , టీచర్స్‌కు 176 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. బ్యాలెట్ బాక్సులను ఇప్పటికే ఆయా జిల్లాల్లో తహసీల్దార్లకు అందజేశారు. పట్టభద్రుల ఎన్నికలకు 1,298, ఉపాధ్యాయులకు 176 బ్యాలెట్ బాక్సులను సిద్ధం చేశారు. పోలింగ్ పూర్తికాగానే పటిష్ట బందోబస్తుతో వాటిని చిత్తూరులోని స్ట్రాంగ్ రూమ్‌కు తరలించేందుకు చర్యలు చేపడుతున్నారు.

పటిష్ట బందోబస్తు

పోలింగ్ రోజున ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయనున్నారు. ఆయా జిల్లాల ఎస్పీల పర్యవేక్షణలో బందోబస్తు ప్రణాళికను అమలు చేయనున్నారు.

నిష్పక్షపాతంగా ఎన్నికలు



ఎమ్మెల్సీ ఎన్నికలను నిష్పక్షపాతంగా నిర్వహించేలా చర్యలు చేపడుతున్నాం. ఓటర్లు ప్రశాంతంగా ఓటు హక్కును వినియోగించుకునేలా జాగ్రత్తలు తీసుకుంటున్నాం. ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలిస్తున్నాం.

– హరి నారాయణన్, రిటర్నింగ్ అధికారి

జాబ్‌మేళా రేపు

చిత్తూరు కలెక్టరేట్ : స్థానిక మురుగానిపల్లెలోని విజ్ఞానసుధ డిగ్రీ కళాశాలలో సోమవారం ఉదయం 9.30 గంటలకు జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కాలేజీ వైస్ చైర్మన్ శ్రీధర్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఇంజనీరింగ్, ఐటీఐ, డిప్లొమా మెకానికల్, బీఎస్సీ కెమిస్ట్రీ కోర్సులు పూర్తి చేసిన వారు జాబ్‌మేళాకు హాజరుకావచ్చన్నారు. వివరాలకు 9505 4112 45 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

రేపటి స్పందన రద్దు

చిత్తూరు కలెక్టరేట్ : ఎమ్మెల్సీ ఎన్నికల కసరత్తులో నిమగ్నమైనందున సోమవా రం కలెక్టరేట్‌లో నిర్వహించనున్న స్పందన కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు జేసీ వెంకటేశ్వర్ తెలిపారు.

తల్లీబిడ్డ అప్పగింత


భార్యాబిడ్డను భర్తకు అప్పగిస్తున్న ఎస్‌ఐ కృష్ణయ్య

రామకుప్పం: మండలకేంద్రంలో కలకలం రేపిన తల్లీబిడ్డ అదృశ్యం కేసును ఎస్‌ఐ కృష్ణయ్య ఛేదించారు. వివరాలు.. భార్య కావేరి, బిడ్డ దీపిక శుక్రవారం కనిపించడంలేదని భాగ్యరాజా అనే వ్యక్తి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు ముమ్మరంగా గాలింపు చేపట్టారు. మొబైల్ ట్రాకింగ్ సిస్టమ్‌ను ఉపయోగించి తల్లీబిడ్డ తిరుపతిలో ఉన్నట్లు గుర్తించి అక్కడి పోలీసుల సాయంతో అదుపులోకి తీసుకున్నారు. తిరుపతి వెళ్లి తల్లీబిడ్డను శనివారం తీసుకువచ్చి భాగ్యరాజాకు అప్పగించారు. ఇంట్లో చిన్నపాటి గొడవ జరగడంతో ఆమె అలిగి బిడ్డతో సహా వెళ్లినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పూర్వపు తహసీల్దార్‌పై చీటింగ్ కేసు

చిత్తూరు అర్బన్: చిత్తూరు పూర్వపు తహసీల్దార్ ఐ.సుబ్రమణ్యంపై శనివారం పోలీసులు చీటింగ్ కేసు నమోదు చేశారు. వన్‌టౌన్ సీఐ నరసింహరాజు కథనం మేరకు.. నగరంలోని బాలగురునాథం అనే వ్యక్తికి స్థానిక పుత్తూరు రోడ్డులో విలువైన స్థలం ఉంది. అయితే కొందరు వ్యక్తులు నకిలీ పత్రాలతో ఆ భూమిని తమ పేరిట రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. దీనికి అప్పటి తహసీల్దార్ సుబ్రమణ్యం సహకరించారని ఆరోపిస్తూ బాధితుడు కోర్టును ఆశ్రయించాడు. దీనిపై కోర్టు విచారించి సుబ్రమణ్యంతోపాటు స్థలం రిజిస్ట్రేషన్ చేసుకున్న కన్నమ్మ, విజయన్, భువనేశ్వరి తదితరులపై కేసు నమోదు చేయాలని పోలీసులను ఆదేశించింది. కాగా, ఆర్నెళ్ల క్రితం చిత్తూరులో వెలుగుచూసిన రూ.కోట్ల భూ కుంభకోణంలో సుబ్రమణ్యం అరెస్ట్ కావడంతో అధికారులు సస్పెన్షన్ వేటు వేసిన విషయం తెలిసిందే.

అభాగ్యులకు ఆపన్నహస్తం

- పిల్లలను వసతిగృహంలో చేర్పించేందుకు చర్యలు
- అండగా ఉంటామన్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

సాక్షి ఎఫెక్ట్..


కుప్పం ఏరియా ఆస్పత్రిలో రాము, శివ

పలమనేరు : తల్లి దూరమై.. తండ్రి పట్టించుకోక అభాగ్యులుగా మారిన గిరిజన బిడ్డలకు జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, వి.కోట ఎంపీడీఓ బాలాజీ ఆపన్న హస్తం అందించారు. పోషణ కరువై.. బతుకుబారమై! అనే శీర్షికతో శనివారం సాక్షిలో ప్రచురితమైన కథనానికి వారు స్పందించారు. ఈక్రమంలోనే విద్యాశాఖ, సాంఘిక సంక్షేమశాఖ, నెర్నిపల్లె సచివాలయ సిబ్బంది, మహిళా పోలీసు తదితరులు మిట్టూరు గ్రామానికి వెళ్లి రాము, శివ తండ్రి చిన్నన్నకు కౌన్సెలింగ్ ఇచ్చారు. మధుమేహంతో బాధపడుతున్న రాము (12)ను కుప్పం ఏరియా ఆస్పత్రికి తరలించారు. శివ(9)ను మాత్రం వి.కోట వసతిగృహంలో చేర్పించనున్నట్లు ఎంఈఓ చంద్రశేఖర్, ఎస్‌డబ్ల్యూఓ షకీలా తెలిపారు.

పిల్లల్ని ఆదుకుంటాం

జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు స్వయంగా మిట్టూరుకు వెళ్లి పిల్లల పరిస్థితిని ఆరా తీశారు. అధికారులతో మాట్లాడి గిరిజన బిడ్డలకు విద్య, వైద్యం అందించాలని ఆదేశించారు. భవిష్యత్‌లో పిల్లల చదువుతోపాటు ఇతర ఖర్చులకు సైతం అండగా ఉంటూ ఆదుకుంటామని భరోసా కల్పించారు.

ఎమ్మెల్యే బాబు పుట్టినరోజు వేడుకలు


ఎమ్మెల్యే ఎంఎస్ బాబుకు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు


ఎమ్మెల్యేని గజమాలతో సత్కరిస్తున్న మోహన్‌రెడ్డి, వెంకటేశు

కాణిపాకం(యాదమరి)/పూతలపట్టు : కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామిని ఎమ్మెల్యే ఎంఎస్ బాబు దర్శించుకున్నారు. శనివారం పుట్టినరోజును పురస్కరించుకుని ఆయన గణనాథుని సేవకు విచ్చేశారు. ఎమ్మెల్యేకు ఆలయ కమిటీ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు స్వాగతం పలికి ప్రత్యేక దర్శనం కల్పించారు. వేదపండితులు ఆశీర్వదించి స్వామివారి చిత్రపటం, తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ శాంతిసాగర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బుజ్జిరెడ్డి, ఏఈఓ విద్యాసాగర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ క్రమంలోనే ఎమ్మెల్యే ఎంఎస్ బాబును జెడ్పీ వైస్ చైర్మన్ ధనుంజయరెడ్డి మర్యాదపూర్వకంగ కలిసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ సురేష్‌బాబు, స్థానిక నేత మనోహర్‌రెడ్డి ఉన్నారు.

ఘనంగా వేడుకలు

ఎమ్మెల్యే ఎంఎస్ బాబు పుట్టినరోజు వేడుకలను స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సచివాలయాల మండల కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి, ప్రవీణ్ పాల్గొన్నారు.

అధికారి అవినీతిపై ఆరోపణలు

చౌడేపల్లె : పట్టాదారు పాసుపుస్తకం కోసం వెళితే వీఆర్‌ఓ పురుషోత్తంరావు రూ.50వేలు డిమాండ్ చేశారని ఉత్తరాది హరిప్రసాద్ అనే రైతు ఆరోపించారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ చారాల పంచాయతీ ఎస్సీకాలనీకి చెందిన తన అనుభవంలో దుర్గసముద్రంలోని సర్వే నంబర్ 552/7లో 2.57 ఎకరాల ప్రభుత్వం భూమి ఉందన్నాడు. సదరు భూమికి పట్టాదారు పాసుపుస్తకం మంజూరు చేయాలని ప్రభుత్వ ఆదేశించినా వీఆర్‌ఓ మాత్రం నగదు డిమాండ్ చేశారని ఆరోపించాడు. అప్పటికే రూ.25వేల చెల్లించానని, మిగిలిన సొమ్ము ఇస్తేనే పాసుపుస్తకం ఇస్తామని వీఆర్‌ఓ స్పష్టం చేశారని ఆవేదన వ్యక్త చేశాడు. గ్రామానికి చెందిన టీడీపీ నేత అడవి రమణతో కుమ్మక్కైన వీఆర్‌ఓ తీవ్రంగా ఇబ్బంది పెట్టినట్లు వెల్లడించాడు. దీనిపై కలెక్టర్ విచారించి న్యాయం చేయాలని కోరాడు. వీఆర్‌ఓ పురుషోత్తంరావును వివరణ కోరగా.. తనపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని, ఎవరినీ నగదు అడగలేదని స్పష్టం చేశారు. ఈ విషయాన్ని తహసీల్దార్ మాధవరాజు దృష్టికి తీసుకెళ్లగా విచారించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మెగా జాబ్ మేళాలో 366 మందికి ఉద్యోగాలు


ఉద్యోగ అర్హత సాధించిన విద్యార్థులతో సిద్ధార్థ ఇంజినీరింగ్ అండ్ ఎంబీఏ కళాశాల ప్రతినిధులు

తిరుపతి కల్చరల్: సి.గొల్లపల్లెలోని సిద్ధార్థ ఇంజినీరింగ్ అండ్ ఎంబీఏ కళాశాలలో శనివారం నిర్వహించిన మెగా జాబ్‌మేళాలో 366 మంది ఉద్యోగాలకు అర్హత సాధించారు. మ్యాజిక్ బస్ ట్రిజెన్ టెక్ ఐటీ సొల్యూషన్స్ సంయుక్త సహకారంతో నిర్వహించిన ఈ జాబ్ మేళాలలో హైదరాబాద్, బెంగళూరు, చెన్నైకి చెందిన 13 ఐటీ, నాన్ ఐటీ కంపెనీలు పాల్గొన్నాయి. చిత్తూరు, తిరుపతి జిల్లాకు చెందిన వివిధ ఇంజినీరింగ్, ఎంబీఏ కళాశాలల నుంచి సుమారు 700 నుంచి 800 మంది గ్రాడ్యుయేట్స్ పాల్గొన్నారు. హాజరైన ఆయా కంపెనీల హెచ్‌ఆర్‌లు విద్యార్థులను వివిధ రకాలుగా పరీక్షించి 366 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేశారు. వీరిలో 248 మంది గొల్లపల్లి సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ఉండడం గమనార్హం. ఈ సందర్భంగా ఆ కళాశాల చైర్మన్ వై.కొండారెడ్డి, కార్యదర్శి వై.ఆనంద్ మాట్లాడుతూ తమ కళాశాలలో అత్యధికమంది తమ కళాశాల నుంచి ఉద్యోగాలకు ఎంపికకావడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఉద్యోగ అర్హత సాధించిన విద్యార్థులను ఈ సందర్భంగా వారు అభినందనలు తెలిపారు. ఉద్యోగ అర్హత సాధించిన వారికి 3.2 ఎల్‌పీఏ నుంచి 5.34 ఎల్‌పీఏ వరకు వార్షిక వేతనం ఉంటుందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రాజశేఖర్ తెలిపారు. ప్లేస్‌మెంట్స్ డైరెక్టర్ పీ.స్వామినాథ్, ఆఫీసర్ ఎస్.భాస్కర్, వివిధ విభాగాధిపతులు సాయిప్రసాద్, ఆనంద్, బాలసుబ్రమణ్యం, అబ్రార్, భయ్యారెడ్డి పాల్గొన్నారు.

భార్యను చంపిన భర్త


హత్యకు గురైన చిన్నమ్మ

కుప్పంరూరల్ : మండలంలోని నిమ్మకంపల్లెలో శుక్రవారం రాత్రి వెంకటేష్ అనే వ్యక్తి తన భార్య చిన్నమ్మ(37)ను హత్య చేశాడు. వివరాలు.. వెంటేష్‌కు భార్య వివాహేతర సంబంధం పెట్టుకున్నట్లు అనుమానం ఉండేది. దీంతో తరచూ గొడవ పడేవాడు. గ్రామస్తులు సైతం పలు పర్యాయాలు ఇరువురికీ పంచాయితీ చేశారు. ఈ క్రమంలో శుక్ర వారం రాత్రి కూడా భార్యాభర్తలు ఘర్షణ పడ్డారు. ఆగ్రహం పట్టలేని వెంకటేష్ భార్యను తీవ్రంగా కొట్టాడు. గొంతుపై బలమైన దెబ్బ తగలడంతో చిన్నమ్మ మృతి చెందింది. ఉదయం గ్రామస్తుల ఫి ర్యాదు మేరకు పోలీసులు ఘటనాస్థలానికి చేరు కుని విచారణ చేపట్టారు. కేసు నమోదు చేసి భర్త వెంకటేష్‌ను అరెస్టు చేసినట్లు సీఐ శ్రీధర్ తెలిపారు.

చికిత్సపొందుతూ వివాహిత మృతి


శోభ మృతదేహం

రామకుప్పం : కర్నాటకలోని క్యాసంబల్లహోబిలి ఉల్కూరు గ్రామానికి చెందిన శోభ (38) అనే వివాహిత ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందింది. ముగ్గురాళ్ల వ్యాపారం చేసుకునే రఘుపతి, శోభ దంపతులు మండలంలోని బందార్లపల్లె పంచాయతీ గిడ్డపల్లె చెరువులో శుక్రవారం ముగ్గురాళ్ల కోసం తవ్వుతుండగా ప్రమాదవశాత్తు సున్నపుదిబ్బలు తలపై పడ్డాయి. దీంతో శోభ తీవ్రంగా గాయపడి, బెంగళూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించింది. రఘుపతి తమ్ముడు మూర్తి ఫిర్యాదు మేరకు రామకుప్పం హెడ్‌కానిస్టేబుల్ మురళీబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మనస్తాపంతో మహిళ ఆత్మహత్య


మృతి చెందిన విమలమ్మ

వి.కోట: మండలంలోని పడిగెలకుప్పంలో విమలమ్మ(52) అనే మహిళ శుక్రవారం ఆత్మహత్యకు పాల్పడింది. వివరాలు.. గ్రామానికి చెందిన కృష్ణారెడ్డికి నలుగురు కుమార్తెలు. రెండో కుమార్తె విమలమ్మను సమీప బంధువు రఘురామిరెడ్డికి ఇచ్చి పెళ్లి చేసి ఇంట్లోనే పెట్టుకున్నారు. ఇటీవల కృష్ణారెడ్డి మృతి చెందడంతో విమలమ్మ అక్కాచెల్లెళ్లు తండ్రి ఆస్తిని అందరికీ పంచాలని తరచూ గొడవకు దిగేవారు. ఈక్రమంలో శనివారం నలుగురు అక్కాచెల్లెళ్ల మధ్య ఆస్తి తగాదా పెరగడంతో పెద్దలు పంచాయితీ పెట్టి మాట్లాడారు. దీంతో మనస్తాపం చెందిన విమలమ్మ ఓ గదిలోకి వెళ్లి ఉరేసుకుంది. స్థానికులు వెంటనే వి.కోట ప్రభుత్వాస్పత్రికి తరలించినా ప్రయోజనం లేకుండా పోయింది. అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. విమలమ్మకు కొడుకు, కుమార్తె ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.